## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి తదితరులు

సైదాబాద్, జూన్ 15: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంకు కాలనీలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఉచిత బాడీ చెకప్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్యం శిబిరాన్ని ఏర్పాటు చేసి అనేక మందికి మార్గదర్శకంగా నిలిచారని ఆమె అన్నారు. నవేద హెర్బ్స్, ఫ్రెష్ పౌండర్ గుండ నవీన్ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించడం పట్ల ఆమె అభినందించారు. మానవ శరీరంలోని వివిధ ముఖ్యమైన విభాగాలకు చెందిన 40 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు సూచనలు, సలహాలను, మందులను అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు కళ్యాణి, హరిప్రియ, సాయికుమార్, నేచురోపతి డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొని కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.రామకృష్ణ, సెక్రటరీ ఎ.రమేశ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ బి.ఆనంద్, సభ్యులు ఆనందమోహన్, సీవీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు

ఆర్కేపురం, జూన్ 15: దేశంలోని ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటం కోసం అవసరమైన పరిస్థితుల్లో విశేషమైన వైద్య సేవలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఎ.వి.ఆర్ మూర్తి అన్నారు. ఆదివారం శివేంకటేశ్వర కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రతిఒక్క బ్రాహ్మణుడు డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ధనం రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కోశాధికారి సాయికిరణ్, బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఎంవీ.సోమేశ్వరులు, వైస్ ప్రెసిడెంట్ పోపూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు టి.సునీత, కార్యవర్గ సభ్యులు వి.మోహనా చార్య, వి. సరళ, ఎ.విజయభాస్కర్, ఏక శిరీష, పి అనిత, ఎస్.ఎస్.ఎన్.శర్మ, వేమూరి ఆనంద్, డి మురళి, ఎస్ సురేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 15: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.11కేవీ సింగరేణి కాలనీ, 11కేవీ నూర్ఖాన్ బజార్, 11 కేవీ తీగలగూడ, 11కేవీ జవహర్‌నగర్, 11కేవీ ఎస్సార్‌టీకాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 11కేవీ సరస్వతి నగర్, 11 కేవీ ప్రశాంత్‌నగర్, 11కేవీ వహీద్ నగర్ కాలనీ, 11కేవీ పూలతోట,11కేవీ యాసిన్ జంగ్ మసీద్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ఆర్కేపురంలో...**

ఆర్కేపురం : వాంబే కాలనీ, గంగా హాస్పిటల్, ఆనంద్ నగర్, పుష్ప గార్డెన్, శివం హిల్స్, అల్కాపురి, లక్ష్మీ నగర్, తారామతి పేట్, గౌరెల్లి, శివగంగ కాలనీ, ఎల్బీనగర్, సిరీస్, లింగోజిగూడ, హనుమాన్ నగర్, డెంటల్ కళాశాల, యాదవ నగర్, ప్రజానివాస్, పసుమాముల 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్నగర్ విద్యుత్ శాఖ డీఈ తెలిపారు. బాంబే కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సౌత్ ఇన్‌పార్క్, పాత్రికేయ నగర్, కాస్మో పొలిటిషన్ కాలనీ, స్వాతి గార్డెన్ పరిసర ప్రాంతాలు. గంగా ఆస్పిటల్ ఫీడర్ పరిధిలో ప్రభాస్‌నగర్, ప్రశాంత్ నగర్, జైన్ మందిర్ లైన్ పరిసర ప్రాంతాలు. ఆనంద్ నగర్ ఫీడర్ పరిధిలో ఆనంద్ నగర్, సాయిబాబా దేవాలయం, తొర్రూర్ ఎక్స్ రోడ్, సాయి పద్మావతి కాలనీ పరిసర ప్రాంతాలు. పుష్ప గార్డెన్ ఫీడర్ పరిధిలో పీవీటి మార్కెట్, డీసీబీ బ్యాంక్, అన్నపూర్ణ కళ్యాణమండపం, సిరి నగర్‌కాలనీ, హుడా కాలనీ, కృష్ణవేణి నగర్, పుష్ప గార్డెన్ ప్రధాన రహదారి, జోనల్ కమిషనర్ కార్యాలయం పరిసర ప్రాంతాలు. శివం హిల్స్ ఫీడర్ పరిధిలో శివం హిల్స్, సీఎస్ఆర్ కాలనీ, ప్రియదర్శి కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, ఎల్లారెడ్డి కాలనీ పరిసర ప్రాంతాలు. అల్కాపురి ఫీడర్ పరిధిలో అల్కాపురి, స్నేహపురి కాలనీ, ఆర్కేపురం పరిసర ప్రాంతాలు. లక్ష్మీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో సీఆర్ఎల్ కాలనీ, నాగేశ్వరరావు కాలనీ, సత్యానగర్, గౌడ్స్ కాలనీ పరిసర ప్రాంతాలు. తట్టి అన్నారం అన్నారం ఫీడర్ పరిధిలో తట్టి అన్నవరం విలేజ్ పరిసర ప్రాంతాలు. గౌరెల్లి ఫీడర్ పరిధిలో గౌరెల్లి విలేజ్ పరిసర ప్రాంతాలు. శివగంగ కాలనీ ఫీడర్ పరిధిలో శివగంగ కాలనీ, శ్రీనివాస కాలనీ, శ్రీ శంకర్ కాలనీ, భరత్ నగర్, ఎన్టీఆర్ నగర్ ఫేస్-3, రాజీవ్ గాంధీ కాలనీ పరిసర ప్రాంతాలు. ఎల్బీనగర్ ఫీడర్ పరిధిలో సరస్వతి నగర్, చింతలకుంట, సూర్యోదయనగర్ కాలనీ పరిసర ప్రాంతాలు. సిరీస్ ఫీడర్ పరిధిలో సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సూర్యోదయర్యోదయ నగర్‌కాలనీ, సరస్వతి నగర్, మధురానగర్, హకీమా బాద్ కాలనీ పరిసర ప్రాంతాలు. లింగోజిగూడ ఫీడర్‌లో మాస్ కాలనీ, మణిపురి కాలనీ, లింగోజిగూడ, సాయినగర్, హెచ్ఎస్ఆర్ అపార్ట్మెంట్స్, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నారు.

## కీసరగుట్టలో గుప్త నిధుల తవ్వకాలు

కీసర, జూన్ 15: కీసరగుట్టలోగుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆధారాలు లభించాయి. ఈ విషయంపై కొంతమంది స్థానికులు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలోని లింగాలకుంటలో గుర్తుతెలియని దుండగులు వ్యక్తులు శనివారం రాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కన్పించాయి. స్వామివారి ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న లింగానికి పూజలు చేసి గుప్త నిధుల కోసం కొన్ని అడుగుల మేర తవ్వి ఆ స్థలంలో పూజలు చేసి తవ్వకాలు జరిపారు. ఘటనా స్థలంలో ఓ మట్టికుండ, ఎర్రని గుడ్డ, పసుపు, నీళ్ల బాటిల్ కన్పించడటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సమస్య పరిష్కరించాలి.. జటిలం చేయొద్దు

- జీవో-118ను ఆపిన దుర్మార్గుడు మధుయాష్కీ గౌడ్
- సమస్య పరిష్కారంపై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, జూన్ 15 : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి తీసుకువచ్చిన జీవో 118ను ఆపి, సమస్యను మరింత జటిలం చేస్తున్న దుర్మార్గుడు, కాంగ్రెస్ నేత మధుయాష్కీ అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉండి సమస్యను పరిష్కరించడం చేతగాక పోరాడి సాధించిన జీవోపైన అవాహకులు, చెవాకులు పేలుతున్నారని దుయ్య బట్టారు. 14 ఏండ్ల పాటు వందలాది సమావేశాలు ఏర్పాటు చేసి వందలాదిగా అధికారులను ఒప్పించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌ల సహకారంతో 118జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. 70% మందికి కన్వీనియన్స్ డీడ్లు వచ్చాయని, చాలా మంది లోన్లు కూడా తీసుకున్నారని తెలిపారు. కాగా, అనుమతి లేకుండా నిర్మించిన ఇండ్లకు రిజిస్ట్రేషన్లు కావడంలేదని, దీనికి జీవో నంబర్ 168 అడ్డు పడుతుందని తెలిపారు. ఆ జీవోని సవరించడం కానీ, రద్దు చేయడం కానీ చేస్తే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం జరుగుతుందన్నారు. అది చేతగాక ఉన్న జీవోను ఆపి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నవాళ్లు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారు.. కానీ ఎల్బీనగర్లో మధుయాష్కీ గౌడ్ సమస్యను మరింత జటిలం చేసి బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా 168 జీవోను సవరించి రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఆ జీవో సవరణకు అన్ని ప్రతిపాదనలు చేయడం జరిగిందని, దానిపై లీగల్ ఒపీనియన్ కూడా తీసుకున్నామన్నారు. అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆపివేశామని, తిరిగి తాము అధికారంలోకి రాకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయిందని తెలిపారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపులు, వినతి పత్రాల ద్వారా ప్రయత్నం చేశామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తన విశ్వరూపం చూస్తారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గటిక రెడ్డి అరవింద రెడ్డి, ఎస్కేడి నగర్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, జనరల్ సెక్రటరీ ధన్‌రాజ్, వైదేహినగర్ నార్త్‌కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు, శ్రీపురం కాలనీ అధ్యక్షులు ముత్యం రావు, శ్రీరాంనగర్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సాగర్ కాంప్లెక్స్ ఫేస్ 2 అధ్యక్షులు మహేందర్ రెడ్డి, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం చైర్మన్ సోమి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనీల్ చౌదరి, మాధవరం నరసింహా రావు, సుమన్ గౌడ్, సుధాకర్ యాదవ్, సతీశ్ గౌడ్, కాజా శ్రీనివాస్, శశిధర్ రెడ్డి, రాఘవేందర్‌రావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గం

**హైకోర్టు న్యాయమూర్తి నర్సింగరావు**




సమావేశంలో ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నర్సింగరావు తదితరులు

సైదాబాద్, జూన్ 15: మధ్యవర్తిత్వం ద్వారానే అనేక సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి నదికొండ నర్సింగరావు అన్నారు. ఆదివారం రాత్రి అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని లూయిస్ బ్రెయిలీ వర్క్ ఆవరణలో ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ది డిసే బుల్డ్ (ఫెడ్) సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సల్ మెడియేషన్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతి సామరస్యం పెంచాలని, న్యాయ సేవలను విస్తృత పరుస్తున్నామన్నారు. కేసుల మధ్య రాజీమార్గమే రాజమార్గమని, అందుకోసం చిన్నచిన్న తగాదాలను స్థానికంగా ఉన్న కమ్యూనిటీ సెంటర్లలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఎవరైతే ఒక న్యాయవాదిని పెట్టుకోలేము, ఖర్చులు భరించలేము అనుకునే వారికి ఉచితంగా తెలంగాణ రాష్ట్ర న్యాయసేవ సాధికారత సంస్థ న్యాయ సేవలు కల్పిస్తుందన్నారు. కేసుల్లో ఎవరో ఒకరు గెలుస్తారు.. ఒకరు ఓడి పోతారు చిన్న విషయమే కానీ ఆ ఇష్యూ ఒకవేళ మధ్యవర్తి ఎవరైనా ఉండి దాన్ని పరిష్కరిస్తే ఇద్దరికి న్యాయం జరుగుతుందన్నారు. కేసులతో ఇద్దరి మధ్యలో గ్యాప్ పెరిగిపోతుంది, విభేదాలు పెరిగిపోతాయన్నారు. కమ్యూనిటీ మధ్యవర్తి ఎవరైతే ఉంటారో ఆయన దగ్గరికి వెళ్లి దానివల్ల ఆ సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. చిన్న కేసుల్లో కోర్టుకు వచ్చి ఇబ్బందులు పడాల్సిన అవసర లేకుండా చిన్న కేసులన్నీ కమ్యూనిటీ సెంటర్లలో పరిష్కరించుకోవాలని సూచించారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పంచాక్షరి, సీనియర్ సివిల్ జడ్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజు, డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సీనియర్ జడ్జి కిరణ్మయి మాట్లాడుతూ.. రాజీమార్గమే అందరికీ రాజమార్గం అని, అందు కోసం చిన్న కేసులను స్థానికంగా న్యాయస్థాధికారపు సంస్థ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెండ్లి ఎన్విరాన్మెంట్ డిజేబుల్ సంస్థ కన్వీనర్ గంగారం, సెక్రటరీ నాగభూషణం, అబ్దుల్ లతీఫ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయికి అడ్డాగా ప్రభుత్వ పాఠశాలలు

- ఫర్నిచర్ ధ్వంసం..
- ఉపాధ్యాయులు, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని మీర్‌పేట్ పోలీసులు
- స్టేషన్ పక్కనే పాఠశాల.. అయినా ఆగని గంజాయి సరఫరా..



పాఠశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యం



టాయిలెట్స్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

బడంగ్ పేట్, జూన్ 15: అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ పాఠశాలలు నిలయాలుగా మారుతున్నాయి. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వం ఉన్నత పాఠశాల, శిర్లాయిల్స్ లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లెనిన్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో గంజాయి రాయుళ్లు స్వైర విహారం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సేవించి మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదని తెలిపారు. పాఠశాలలో ఉన్న లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు ధ్వంసం చేస్తున్నట్లు ఉపాధ్యాయుల పేర్కొంటున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తే ఉపాధ్యాయులపై గంజాయి రాయుళ్లు ఎదురుదాడికి దిగుతున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, వాటర్ పైప్‌లైన్లు, నల్లా ట్యాప్‌లను సైతం ఎత్తుకుపోయినట్లు అధ్యాపకులు పేర్కొంటున్నారు. జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి రాయుళ్లు చేస్తున్న అరాచకాలపై మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయురాళ్లకు, విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శిర్లాహిల్స్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సైతం ఇవే సంఘటనలు పునరావృత్తం అవుతున్నట్లు పేర్కొంటున్నారు. గంజాయి రాయుళ్లను పట్టుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేకపోతే ఇక సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలే కాకుండా, చెరువుల సమీపంలోనూ గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారని కాలనీవాసుల నుంచి సైతం పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా గంజాయి రాయుళ్లను నియంత్రించడంలో పోలీసులు విఫలం చెందుతున్నారని ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు.ఇకనైనా పోలీసులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో గంజాయి రాయుళ్లకు కళ్లెం వేసే విధంగా చర్యలు తీసుకుంటారు లేదో వేచి చూడాలి.

### ఫర్నిచర్ ధ్వంసం చేస్తున్నారు..

జిల్లెల్లగూడ చల్లాలింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంజాయి రాయుళ్లు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. లైట్లు, సీసీ కెమెరాలు, పైపులు ధ్వంసం చేశారు. రెండు లక్షల వరకు నష్టం జరిగింది. మళ్లీ రూ.1,50,000 పెట్టి రిపేర్ చేయించాం. మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించాలి. సాయంత్రం అయిందంటే గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారు.

– కృష్ణయ్య, మండల విద్యాధికారి

## ఘనంగా శ్రీ సుదర్శన నారసింహ హోమం



మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని శ్రీ వైష్ణవ సదనంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీదేవనాథ రామానుజ జీయర్ స్వామి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. శ్రీ వైష్ణవ సమాజ అభ్యున్నతి వరకు శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు పాటుపడాలన్నారు. పేద శ్రీవైష్ణవ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందించి ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహారెడ్డి, నాయకులు వి. శ్రీనివాస్‌రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, శ్రీ వైష్ణవ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీఎల్ఎన్ ఆచారి, ప్రధాన కార్యదర్శి కందాల కృష్ణమాచారి, కోశాధికారి కండ్లకుంట వెంకటరామప్రసాద్, ప్రముఖ గాయకుడు కోమాండూరి రామాచారి తదితరులు పాల్గొన్నారు. – మన్సురాబాద్, జూన్ 15

## ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి



మాట్లాడుతున్న జంగారెడ్డి

కందుకూరు, జూన్ 15: ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికి అందేవిధంగా కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్‌లీడర్ ఏనుగు జంగారెడ్డి తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడంతో మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామస్తులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. మాజీ సర్పంచ్ డేరంగుల నరసింహ ఆధ్వర్యంలో ఆయనకు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగ రెడ్డి, అందుగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మదన్ పాల్ రెడ్డి, కాకి నరసింహ, సత్యనారాయణ రెడ్డి ,మధుసూదన్ రెడ్డి, శ్రవణ్‌కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహ, శ్రీశైలం పాల్గొన్నారు.

## వాకర్స్‌కు వన్ ఎలక్షన్‌పై అవగాహన



ఏపీఐయూ కాలనీలో వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్, లింగాల హరిగౌడ్

సైదాబాద్, జూన్ 15: సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు పార్కుల్లో ఆదివారం పార్కుల్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై వాకర్స్‌కు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, లింగాల హరిగౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికల వ్యయాన్ని తగ్గించడానికి ఒకేసారి అన్ని ఎన్నికలను నిర్మించడం ద్వారా దేశ అభివృద్ధికి ఎంతో గాను ఉపయోగపడుతుందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలుపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు వాకర్సు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల ఎంపికకు పోటీలు

**చర్లపల్లి, జూన్ 15 :** క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపికకు పోటీలను నిర్వహిస్తున్నామని కాప్రా మండలం ఎంఈఓ బాపురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుషాయిగూడ స్కూల్‌లో ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోపు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకొవాలని, విద్యార్థులు కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డ్, ఐదు ఫోటోలు, 3వ తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన కోరారు.

## ఇంట్లో బంగారం అపహరణ

**పీర్జాదిగూడ, జూన్ 15:** ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు,వెండి వస్తువులు దొంగిలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకా రం... బోడుప్పల్ పరిధి రాజలింగం కాలనీకి చెందిన భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 13న నగరంలో ఉంటున్న తన బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి.దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 5 జతల బంగారు ఉంగరాలు, 2 ఉంగరాలు, 10 తులాల వెండి వస్తువులు, కొంత నగదు కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని తెలుసుకున్న బాధితులు ఆదివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

# దెబ్బ తిన్న రోడ్లు.. వాహనదారుల ఇబ్బందులు

మలక్‌పేట, జూన్ 15: మలక్‌పేటలోని నల్గొండ చౌరస్తా అక్బర్ ప్లాజా వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతల మయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల డ్రైనేజీ లైన్‌కు మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చినప్పటికీ, అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మట్టి కోసుకుపోయి గుంతలమయంగా తయారైంది. దాంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారి వేగం నెమ్మదించడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు దగ్గరుండి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నప్పటికీ, పూర్తిగా పాడైన రోడ్డుపై ప్రయాణాలు సాగించడం ఇబ్బందిగా మారింది. దాంతో జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించి రోడ్డును నిర్మించాల్సిందిగా కోరగా, వెంటనే స్పందించిన అధికారులు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. అయినప్పటికీ ట్రాఫిక్ అవస్థలు తప్పకపోవడంతో వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.



మలక్‌పేటలోని నల్గొండ చౌరస్తా అక్బర్ ప్లాజా వద్ద పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు